# పదునేడవ ప్రసంగము

ఒకమారు శ్రీప్రకాశానందస్వామివారును, త్రిభువనభాయి యును జేతపురమునుండి కాలినడకను పీరడిమూ వెళ్ళిరి.

## స్వామివారి సేవాభావము.

స్వా॥ ని॥ :—తమరు ఎట్లు వచ్చిరి?

స్వా. ప్ర. :—కాళ్లతో నడచి.

స్వా. ని. :—నడచి ఇంతదూరము వచ్చిరా?

ఈవిధముగా పలికి, ఎంతయో విచారించి ప్రకాశానందస్వామి వారి కాళ్ళను నొక్కుటయును, విసరుటయును మొదలిడిరి.

ఇదిగాంచి ప్రకాశానందస్వామివారు ఇట్లనిరి. తమరిని నేను పూజ్యులుగా భావించుచున్నాను. కావున నావిషయమున తమరు ఇట్లుచేయుట తగదు.

## రాజసికప్రవృత్తిచే యతిధర్మమునకు భంగము.

స్వా. ని. :— (వైద్యరాజువైపు జూచి) వైద్యవర్య! ముందు కబురుపంపినచో దర్బారునుండి బండి పంపబడేదికదా!

స్వా. ప్ర. :—బండి పంపమని నేను ఎప్పుడును ఎవరికిని వ్రాయను. నాతో మొదట త్ర్యంబకభాయి వచ్చేవారు. వారి ఆరోగ్యము సరిగా లేనందున స్టేషనుదగ్గర బండి ఉండదేమో అని బండి పంపమని వ్రాసెడివాడను. అప్పుడు రెండుగుర్రములబండి అట్టహాసముతో వచ్చెడిది. అది నాకు బాగుండెడిది కాదు. 'ఏలనన, త్యాగికి రాజసిక ప్రవృత్తి తగదు.

ఈవిషయమున స్వామి నిత్యానందులవారు ఒకదృష్టాంతమును సెలవిచ్చిరి. శ్రీరామచంద్రుని సమయమున ఒక సన్యాసి యజ్ఞశాల

లోనికి ప్రవేశించుచుండగా (పూర్వము సన్యాసులు యజ్ఞశాలలు మొదలగుచోట్ల ఉండెడివారు) ద్వారముచెంతనున్న ఒకకుక్కను అకారణముగా కర్రతో కొట్టెను. అంతట ఆకుక్క శ్రీరామచంద్రునితో మొరబెట్టుకొనుటకు వెళ్ళెను. దరఖాస్తుదారుడు తనను ముఖాముఖిగా కలసికొనుటకు శ్రీరామచంద్రుడు సింహద్వారము చెంతను ఒకగంటను కట్టించెను. ఆఘంటానాదము విని శ్రీరామచంద్రుడు ఎవడో దరఖాస్తుదారుడు వచ్చెనని తెలిసికొని వినుటకు వచ్చెడివాడు. కుక్క పండ్లతో గొలుసునులాగి గంటమ్రోగించెను. గంట విని ద్వారముచెంత నెవరుకలరో తీసికొనిరమ్మని ద్వారపాలుని పంపెను. ఎవరును లేరని ద్వారపాలుడు చెప్పెను. కుక్క మరల గంటమ్రోగించెను. అప్పుడు లక్ష్మణుడు వచ్చెను. అతడుకూడ మనుష్యుడు ఎవడు కనుపించనందున మరలిపోయెను. కుక్క మూడవమారు గంటమ్రోగించెను. ఈమారు శ్రీరామచంద్రుడు స్వయముగా వచ్చెను. ఆయన కుక్కను చూచి ఇట్లు ప్రశ్నించెను. "దరఖాస్తుదారుడవు నీవేనా?" కుక్క మానవవాక్కులతో ఇట్లనెను. "అవును. ఒకసన్యాసిపై నేను ఫిర్యాదుచేయుచున్నాను. కారణము లేనిదే ఒకసన్యాసి నన్ను కర్రతో కొట్టెను." దాని మానవవాక్కులను విని రామచంద్రుడు ఇట్లు ప్రశ్నించెను. "నీవు పూర్వజన్మమునందు ఎవరవు?" కుక్క సమాధానము చెప్పెను. "పూర్వజన్మమునందు నేను ఒకవిద్వాంసుడనగు బ్రాహ్మణుడను. కొన్ని అపకృత్యములనుచేయుటచే ఈజన్మమునందు కుక్కగా జన్మించితిని."

రామచంద్రుడు అడిగెను:—సన్యాసిని నేను ఏమిచేయగలను?

కుక్క సమాధానము చెప్పెను:—"ఎవడైననుసరే. మీరు రాజు కనుక దండించవచ్చును?" అంతట రామచంద్రులు కుక్కను తీసికొని, సన్యాసివద్దకు వెళ్ళి కుక్కనుకొట్టుటకు గల కారణము అడిగెను.

సన్యాసి :—నేను యజ్ఞశాలలోనికి ప్రవేశించునప్పుడు వెనుకనుండి నన్ను కరచునను ఉద్దేశ్యముతో నేను కుక్కను కొట్టితిని.”

సన్యాసి ఇట్లు నేరమును ఒప్పుకొనెను. కాని సన్యాసి పూజ్యుడుకదా! ఆయనను దండించుట ఎట్లు అని శ్రీరామచంద్రుడు అనుకొనెను. ఇది గ్రహించి కుక్క ఇట్లనెను. “ఏనుగ అంబారీపై కూర్చుండబెట్టి వాద్యవైభవములతో గ్రామమునందు ఊరేగింపుడు. ఇది ఆసన్యాసికి తగిన శిక్ష.”

శ్రీరామ:—ఇదేమి శిక్ష?

కుక్క:—“గృహస్థులను గాడిదపై కూర్చుండబెట్టి ఊరేగించుట చాల పెద్దశిక్ష. అటులనే సన్యాసులను ఏనుగఅంబారీపై కూర్చుండబెట్టి వాద్యవైభవములతో గ్రామమంతయును ఊరేగించుట పెద్దశిక్ష. ఏలనన ఈరాజసిక ప్రవృత్తిచే వారికి ఎంతయో అగౌరవము కలుగును. వారి యతిధర్మము నశించును.”

పూర్వము సన్యాసులు ఇది శిక్షగా తలచెడివారు. కాని ఇప్పుడు ఇట్టి రాజసికప్రవృత్తిని గౌరవప్రదముగా తలచుచున్నారు.

స్వా. ప్ర. :—తమమాట యథార్థము. ఈక్రింది దృష్టాంతముకూడ దానికి సంబంధించినదియే.

## భిన్న దృక్పథములు.

ఆఫ్గన్ స్థానమునుండి ఒకపఠాను హిందుస్థానమునకు వచ్చెను. ఒక గ్రామమున అతడు సంచరించుచు ఒక మిఠాయి దుకాణమునకు వెళ్ళి అడిగెను. ఇది ఏమిటి? దుకాణదారుడు చెప్పెను. “ఖాజా.” పఠాను “ఖా జా” అనుమాటకు “తిని పొమ్ము” అను అర్థమును గ్రహించెను. తను తినుటకు ఆతడు అనుమతించుచున్నాడని తలచి అవి అన్నియు తినసాగెను. అతడు ఆఖాజాలు తినుటచూచి దుకాణదారుడు పోలీసులను పిలచి చెప్పెను. పోలీసులు అతనిని న్యాయాలయ

మునకు తీసికొనిపోయెను. న్యాయాలయమున న్యాయాధిపతి అతనిని మిఠాయిలు ఎందుకు తింటివి? అని ప్రశ్నించెను. దుకాణదారుడు నన్ను 'ఖా జా'(తినిపొమ్ము)అని చెప్పెను.అందుచే తింటిని అని అతడు సమాధానము చెప్పెను. న్యాయాధీశుడు ఆతనిని గాడిదపై కూర్చుండ బెట్టి గ్రామమంతయు త్రిప్పమని ఆజ్ఞాపించెను. ఆతనినిగాడిదపై నెక్కించి గ్రామములో త్రిప్పసాగిరి. ఆతడు గ్రామములో తిరుగుచుండగా కొందరు జనులును, పిల్లలును చప్పట్లు కొట్టుచు నవ్వసాగిరి. ఇది గాంచి పఠానుడు సంతోషించి ఇట్లనెను హిందూదేశము ఎంత మంచిదేశము ఈ దేశపు జనులు తినుటకు మిఠాయిలు పెట్టిరి. అంతియే కాదు. గాడిదపై కూర్చుండబెట్టి గౌరవించిరి.

---

(ఆఫ్గనిస్థానములో 5, 6 గాడిదలు ఉన్నవాసని ఎక్కువ గౌరవించెదరు. గాడిదపై ఊరేగించుట హిందూదేశములో అగౌరవము. అదియే ఆదేశములో గౌరవము.) మనవంటి సన్యాసులుకూడ ఆపఠానునివలె సంచరించుచున్నారు.

*అహో బత ! మహత్కష్టం విపరీత మిదం జగత్ ।*
*యేనాపత్రపతే సాధురసాధుస్తేన తుష్యతి॥*

"ఈప్రపంచపు పోకడ చాల విపరీతము. ఇది చాల కష్టదాయకమైనది. సాధువులు దేనిని చూచి సిగ్గుపడుచున్నారో, దానిచేతనే అసాధువులు సంతోషించెదరు.

వైద్యరాజు:— ముందు తెలిసినచో గుర్రపుబండిని పంపి ఉండెడివాడను.

స్వా. ని.:— తమరు ఇంతదూరము కాలినడకను వచ్చి అలసిపోయిరి. ఇది నాకేమి బాగుండలేదు. దర్బారుసాహెబునకు తెలిసినచో వారు ఎంతయో కష్టపడెదరు.

స్వా. ప్ర.:— నాతో మరిఇద్దరు, ముగ్గురు ఉండిరి. బండికొరకు చూచితిమి. కాని దొరకలేదు.

అంతట త్రిభువనభాయి శ్రీనిత్యానందస్వామివారిని పూల హారముచే అలంకరింపదలచెను. నిత్యానందులభారు శ్రీప్రకాశానందస్వామికి హారమును వేయుడని చెప్పెను.

త్రిభువన :—వారికిని హారము వేయుదను.

ఇట్లు పలికి ఇరువురు స్వాములకును హారములువేసి త్రిభువన భాయి సాష్టాంగదండప్రణామము ఆచరించెను.

## నమస్కారముల ఆధిక్యముతో దైవసంపద కలవానికి హాని కలుగును.

ఇది చూచి శ్రీనిత్యానందస్వామివారు ఎంతయో బాధ పడుచు ఇట్లనిరి :—

"ఈ సాష్టాంగదండప్రణామములను పొందుట నాకు సిగ్గు." ఇట్లు పలికి మెడలోని హారమును తీసివేసిరి.

స్వా. ప్ర. :—మహాత్ములు దైవసంపదను కలిగియుందురు. వారికి గౌరవము కావలెనను భావము మనస్సునందుండదు. దైవసంపద అనగా అమానిత్వము. అది వారికి స్వభావసిద్ధము. ఎవరైన తమను గౌరవించిన వారు సహించలేరు.

"అమానిత్వం అదమ్భిత్వం" అని గీతయందు కలదు కదా! శ్రీజ్ఞానేశ్వరీగీతయందు దాని భావార్థము కలదు. అది కొంచెము నాకు జ్ఞాపకము ఉన్నది. మహాత్ములకు ఇతరుల నమస్కారములను పొందుట మృత్యువుతో సమానముగా తోచును. జనులు వారికి చేయు సన్మానమును స్తోత్రమును, వారు సహించలేరు.

ఈ విషయమున తుకారాముగారు చెప్పినది ఆలకించుడు:—

"జనులు నన్ను దేవునిగా భావించుచో అధర్మమును అంటగట్టుచున్నారు. ఆ గౌరవముచే నాకు సుఖము ఏమియు కలుగదు. ఇందు నాకు ఏమియు గౌరవము కన్పించదు. కాని ఈజనులు ఒప్పుకొనుట

లేదు. ఏమి చేయుదును? శరీరమునకు చేయు ఈ ఉపచారములచే ఒడలు మండిపోవుచున్నది. ఈ ఉత్తమమగు మృష్టాన్నములు విషము వలె కన్పట్టుచున్నవి. ప్రజలు ఎంతయో పొగడుచున్నారు. కాని నేను భరించలేకపోవుచున్నాను. ప్రాణము జిల్లార్చుకు పోవుచున్నది. ఓ భగవానుడా! నీవు దొరుకుటకు వీలగుమార్గమును జూపుము. ఎండ మావుల వెంటాడించకుము. ఇప్పుడే నన్ను రక్షించుము. కాలుచున్న నిప్పునుండి రక్షించి మేలుచేయుము.''

మహాపురుషులు గౌరవమును స్వీకరించరు. అగౌరవముచే బాధపడరు. ఈక్రిందిదృష్టాంతముచే ఆసంగతి విశదమగును.

ఒక మహమ్మదీయ మహాత్ముడు ఉండెను. వారి చెంతకు ఒక ముముక్షువు వెళ్ళి చెప్పెను:- "మహాత్మా! నేను ముప్పది సంవత్సరములనుండి రంజానుమాసములో ఉపవాసములు చేయుచున్నాను. జాగరము చేయుచున్నాను. సాధన చేయుచున్నాను. అయినను తమరు ఉపదేశించిన గూఢమగు తత్త్వజ్ఞానముయొక్క లేశమాత్రము నా జీవితమునందు కన్పట్టుటలేదు. ఏమి కారణము?''

మహాత్ముడు:—సోదరా! ముప్పది సంవత్సరములేకాదు. మూడువేల సంవత్సరములు నీవు ఈవిధముగా ఉపవాసములు ఉన్నను నీపరిస్థితిలో కొంచెమైనను మార్పు రాదు. వానిచే నీకు ఏమాత్రము మేలును కలుగదు.

ముముక్షువు :—ఇది ఎందుచేత?

మహాత్ముడు :—నీజీవితము అనేకరకములగు సాంసారిక ఆవరణములచే కప్పబడి ఉన్నది. అందుచేత?

ముముక్షువు:—అందుకు తరణోపాయమేమి?

మహాత్ముడు:—దానికి నావద్ద ఔషధము కలదు. కాని నీవు తినలేవు.

ముముక్షువు:- తినగలను. నేను చాలసంవత్సరములనుండి అట్టి ఔషధముకొరకు వెతుకుచున్నాను.

మహాత్ముడు:—సరే, మొదట నీవు నీతలగొరిగించుకొనుము. సౌందర్యము పెంపొందించు ఈవస్త్రాదిభూషణములు అన్నియును శరీరమునుండి తొలగించుము. ఒక కుప్పటిమాత్రము ఉంచుకొనుము, నగరమువెలుపట మార్గమున అందరును నిన్ను గుర్తించుచోట వెళ్లి కూర్చొనుము. నీదగ్గర కొన్ని బొంగరములు ఉంచుకొనుము. ఇరుగుపొరుగు బాలురను పిలచి నిన్ను రెండేసి రాళ్ళతో కొట్టిన వానికి ఒక బొంగరము ఇమ్ము. ఇట్లు వీధివీధికి తిరిగి పిల్లలచే అవమానమును పొందుము. ఎక్కడ నిన్ను ఎక్కువగా అవమానించెదరో అక్కడ నివసించుము. ఇదియే నీకు ఉత్తమమగు ఔషధము.''

నారదపరివ్రాజకోపనిషత్తునందు ఉన్నది.

*సంమాననం పరాం హానిం యోగర్ద్ధా కురుతే యతః ।*
*జనేనావమతో యోగీ యోగసిద్ధిం న విన్దతి ॥*

"లోకులు గౌరవించుట యోగసిద్ధికి మిక్కిలి హానికరము. జనులచే అవమానింపబడిన యోగి యోగసిద్ధిని పొందును.''

అందుచేతనే త్యాగులు ఒకచోట ఉండరు. ఒకచోట ఉన్నచో జనుల పరిచయము పెరుగును. జనులు సత్సంగమునకు వచ్చెదరు. అంతకంతకు వారి పూజాపురస్కారములు పెరుగును. ఇది త్యాగులు పతితులు అగుటకు మార్గము. కావున వారు ఒకచోటినుండి మరియొకచోటికి వెళ్ళుచుండవలెను. ఎక్కువగా తిరుగుటకు ఇష్టములేని వారు జనులు తమచెంతకు రాని ఉపాయమును పన్నవలెను. ఎట్లన—

ఒక మహాత్ముడు సంచారము చేయుచు ఒక గ్రామమునకు వచ్చెను. ఆగ్రామమునకు బయట దూరముగా తన యోగాభ్యాసమునకు అనుకూలమగు ఏకాంతస్థలమును చూచి, కుటీరమును నిర్మించుకొని నివసించెను. గ్రామీణులకు ఈసంగతి తెలిసి వారి దర్శనమునకు రా మొదలిడిరి. అంతకంతకు ధర్మమునకు సంబంధించిన ప్రశ్నలు

అడుగుట ప్రారంభ మయ్యెను. మహాత్ముడు విరాగి, యోగి, ధర్మ రహస్యము తెలుపుచురు అను సంగతి గ్రామమంతయును తెలిసిపోయెను. అంతకంతకు సత్సంగమునందు కోరిక కలిగి జనులు పూజాదులకు వలయు సామగ్రి తీసికొని వారిచెంతకు రా మొదలిడిరి. మహాత్మునికి ఇదేమియు నచ్చలేదు. జనులు చేయు ఈ గౌరవముచే వారి యోగాభ్యాసమునందు అంతరాయము కలుగుచుండెను. కావున ప్రజలు తనను అవమానించి తన చెంతకు రాకుండుటకు ఒక ఉపాయమును ఆయన ఆలోచించెను. ఒకనూరు ఆయన నదికి స్నానము చేయుటకు వెళ్లెను. అక్కడ ఒక ఆమె తన వస్త్రములను, ఆభరణములను కొన్నిటిని తీరమున ఉంచి స్నానము చేయుచుండెను. "ప్రజల అవమానమును పొందుటకు ఇది చాలును" అని తలచిఆబట్టలను, ఆభరణములను తీసికొని మహాత్ముడు పరుగెత్తెను. వస్త్రములను దొంగిలించుట చూచి ఆమె "దొంగ, దొంగ" అని, ఆయనను వెంటాడెను. జనులు గుమికూడి మహాత్ముని పట్టుకొని నానామాటలు ఆడిరి. "ఈయన ధర్మపన్నములు మనకు ఏకరువు పెట్టెను. మనము ఇతనిని గొప్ప యోగిగా భావించితిమి. కాని, ఇతడు దొంగ అని మనకేమి తెలియును? కబుర్లు ఎంతయో జ్ఞానము ఉన్నట్లు చెప్పును. జ్ఞానముపేరుతో మనలను మోసగించుచున్నాడు." ఈసంగతి గ్రామములో తెలిసినంతనే అతనికి ఎంతయో అపకీర్తి కలిగెను. అంతటినుండి జనులు అతనివద్దకు వచ్చుట తగ్గెను. ఆమహాత్మునకు తనకు కలిగిన అవమానముతో యోగాభ్యాసమునకు వలయు సౌకర్యములు కలిగెను.

నారదపరివ్రాజకోపనిషత్తు పరికించుడు:—

తథా చరేద్వై యోగీ సతాం ధర్మమదూషయన్ ।
జనా యథాఽవమన్యేరన్గచ్ఛేయుర్నైవ సంగతిమ్ ॥

"తత్త్వజ్ఞులు సజ్జనులాచరించు ధర్మమునందు ఎట్టి కళంకమును కలుగనివిధముగా సంచరించవలెను. అటులనే ప్రజలు తమను అవమానించి తమ సాంగత్యమును పొందుటకు ఎట్లు ఇష్టపడరో ఆవిధమున సంచరించవలెను."

స్వా. ని.:— శ్రీకృష్ణచైతన్యులు చెప్పిరి:—

*తృణాదపి సునీచేన తరోరివ సహిష్ణుతా।*
*అమానినా మానదేన కీర్తనీయః సదా హరిః॥*

"తృణముకంటె తాను తక్కువవాడనని తెలిసికొనవలెను. వృక్షమువంటి సహనగుణమును పొందవలెను. గౌరవము తనకు లభించినను దానియందు లక్ష్యము ఉంచరాదు. ఇతరులను గౌరవించవలెను. ఇట్టి స్వభావముతో ఎల్లప్పుడును హరిని కీర్తించవలెను."

తృణముకంటె తనను నీచముగా తలచవలెనని కబీరుకూడ చెప్పెను:—

దాస కహావత కఠినో హై మైం దాసనకో దాస్;
అబ తో ఐసా హో రహూం పాఉం తలే కే ఘాస్.

"నేను దాసుడననుకొనుట కష్టముగా నున్నది. ఏలనన— నేను దాసానుదాసుడను. ఇప్పుడు నేను పాదముక్రింద గడ్డివలె నుండవలెనని నాయాశ."

వృక్షమునకు ఉన్న సహనగుణమును అలవరచుకొనవలెనను విషయమున దత్తాత్రేయుని వాక్యమును గమనించవలెను. ఆయన 24 మంది గురువులను సేవించినట్లు వివరించెను. అందు వృక్షమును కూడ గురువుగా వర్ణించెను "*నగశిష్యః పరాత్మనామ్*" వృక్షము పండ్లకొరకు రాళ్ళు విసురువానిని ఏమియు అనదు. వేళ్ళతో పెల్లగించి తీసికొనిపోయినను ఏమియు పలుకదు. అట్టి సహనగుణమును అలవరచుకొని పరోపకారస్వభావమును స్వీకరించవలెను.

ఈసంగతి బైబిలునందుకూడ ఉన్నది:—

“నీయొక్క ఒక చెంపపై ఎవడైన దెబ్బకొట్టినచో రెండవ చెంపకూడ వాని ఎదుట ఉంచుము. ఎవడైనా నీబొత్తము తీసికొని పోయినచో నీచొక్కా ఇచ్చివేయుము. ఎవడైన బలవంతముగా నిన్ను ఒకక్రోసుదూరము తీసికొనిపోయినచో నీవు ఇంకొకక్రోసు వెళ్ళుము.”

అమానిత్వము:— ఎట్టి అహంభావమును (గౌరవమునందు ప్రేమ) కలిగియుండరాదు. జగత్తునందలి మాయికపదార్థములను అన్నిటిని త్యజించవచ్చును. కాని అహంభావమును త్యజించుట కష్టము. ఈవిషయమున కబీరువాక్యము వినుడు:—

మాయా తజా తో క్యా భయా మాన తజా నహి జాయ్;
మాన బడే మునివర గలే మాన సబనకో ఖాయ్

“మాయను వదలిపెట్టినందున విశేషమేమున్నది? అహంభావమును విడచుటలో కష్టమున్నది. అహంభావము అందరిని మునివరులనుకూడ మ్రింగివేయును.”

ఒకడు పర్వతగుహాలోనికి వెళ్ళి యోగాభ్యాసము చేయుచుండెను. కొద్దిరోజులలో చుట్టుప్రక్కలనున్న గ్రామముల జనులు ఆతనిని గుర్తించిరి. ఆతని దర్శనమునకు జనులు రాసాగిరి. అంతకంతకు వాని ఖ్యాతి పెరిగెను. తుదకు ఆతని దర్శనమునకు దేశమంతటినుండియు వేలకొలది మనుష్యులు వెళ్ళుట మొదలిడిరి. “నా అభ్యాసమునందు విఘ్నము కలుగుచున్నది” అని అతడు చెప్పెను. అంతటినుండి ప్రతిపూర్ణిమకును వారిదర్శనము చేయుటకు నిశ్చయించుకొనిరి. తరువాత ప్రతిపూర్ణిమకును లక్షలకొలది జనులు వారిదర్శనమునకు బండ్లపై వచ్చి రోజంతయు అక్కడ ఉండి ధూప, దీప, నైవేద్యాదులతో పూజించుచుండిరి. మనుష్యులరాక పెరిగినకొలదియు ఆతని ఆహారము తగ్గసాగెను.

ఈసందర్భమున జనులు అనేకరకములగు కల్పనలు చేయసాగిరి. "ఈయన హఠయోగి. ఖేచరీముద్రిద్వారా అమృతపానము చేయును." ఇట్లు భావించి హఠయోగి అని ఆయనను పూజించిరి. ఈ పద్ధతికూడ ఎక్కువ అయిపోయెను. కొంచెముకాల మయినతరువాత ఒక విద్వాంసుడు ఇట్లనెను. ఈయన గౌరవము నాధారముగాచేసికొని బ్రతుకుచున్నాడు. "గౌరవముపై బ్రతుకుట అనగానేమి" అని అడిగిరి. ఆవిద్వాంసుడు ఒక అసత్యమును ఆయనవిషయమున వెల్లడించెను.

"రాబోవు పూర్ణిమకు సాధువుగారు దర్శనము ఇవ్వరు, పై పూర్ణిమకు రండు." ఆయోగిమాత్రము మామూలుప్రకారము పూర్ణిమరోజున గుహనుండి బయటకు వచ్చెను. అక్కడకు ఎవరును రాలేదు. ఆయన హృదయమునకు తగిలిన ఆఘాతముచే హృదయము ఆగిపోయెను.

తరువాత జనులు వచ్చిచూడగా ఆయన ప్రాణములు పోయి ఉండెను. అంతట ఆమొదటి విద్వాంసుడు పలికెను. "ఈయన గౌరవముపై జీవించెను. గౌరవము లభించినంతకాలము ఈయనకు ఆహారము అక్కరలేకపోయెను."

అనంతరప్రసంగమున త్రిభువనభాయి పలికెను.

నేను మొదట జలగాములో మిల్లులో ఉద్యోగము చేయుచుంటిని. అచ్చట నుండగా ఒకమారు శ్రీస్వామి ప్రకాశానందులవారు అచ్చటకు వచ్చిరి అని తెలిసికొని వారిదర్శనమునకు వెళ్లితిని. "జ్ఞాని ఎట్లుండును?" అని వారిని ప్రశ్నించితిని. అప్పుడు వారి సమాధానముచే నామనస్సునకు సంతృప్తికలిగెను కఠియావాడు వచ్చినతరువాతకూడ శ్రీస్వామివారు జామ్‌నగరులో నున్నారని తెలిసికొని వారి దర్శనమునకు వెళ్ళితిని. వారి శ్రీముఖమునుండి తమస్తుతి విని

ప్రకాశానందులవారి స్తోత్రమునకు పాత్రులగు తమదర్శనము చేయవలెనని కోరిక కలిగెను. ఆఉద్దేశ్యముతోనే ఇక్కడకు వచ్చితిని.

స్వా. ని. :—నేనేమి గొప్పవాడను కాను. మీరందరును గొప్పవారు. కావుననే నన్ను గొప్పవానినిగా తలచుచున్నారు.

## శాస్త్రవిరుద్ధమగు ప్రవర్తనకు కారణములు.

త్రిభు:—శాస్త్రోపదేశకులు, శ్రోతలు అసంఖ్యాకులుగా నున్నారు. కాని శాస్త్రములను అనుసరించువారు తక్కువ. దీనికి కారణము ఏమి?

స్వా. ని. :—విషయములనుండి మనస్సును ఆపుశక్తి వారికి లేదు. ఏలనన, చాలమంది రజోగుణముకాని, తమోగుణముకాని ప్రధానగుణములుగా కలిగియుందురు. గ్రహణితో బాధపడుచున్న వాడు లడ్డూలు తినకూడదు. తినిన రోగము పెరుగును. అది ఎరిగి యుండికూడ భోగప్రాబల్యమునకు లోనయి దొంగిలించి అయినను లడ్డూలు తినును. అటులనే అవిద్యాప్రాబల్యమున విషయభోగములు హాని కలుగజేయును— అని ఎరిగియుండికూడ అందు ప్రవర్తించును.

## విషయాదులయందు నిమగ్నుడగుటకు కారణము.

స్వామిప్రకాశానందులవారి అభిప్రాయమును నిత్యానంద స్వామివారు ఈసందర్భమున తెలుపమని కోరిరి.

స్వా. ప్ర. :—అవిద్యాప్రాబల్యము ఒకకారణము. కాని ముఖ్యకారణము మాత్రము వేదశాస్త్రములపై శ్రద్ధ లేకపోవుటయే. శాస్త్రమునందు శ్రద్ధయున్నచో కొద్దియో గొప్పయో ఓర్పు కలిగి యుండి, విషయాదులను ఎదిరించి ఆత్మసుఖమును అనుభవించవచ్చును. రోగమునకు మందిచ్చుచు వైద్యుడు ఫలాన పథ్యములుకూడ చేయ వలెనని చెప్పును. వైద్యునిపైకల నమ్మకమువలన పూర్తిగా పథ్యము ను రోగి చేయకపోయినను కొలదియో గొప్పయో పథ్యములను

ఆచరించును. అటులనే ధర్మముపై శ్రద్ధ ఉన్నచో కొద్దియో గొప్పయో సంయమము కలిగియుండి, విషయములకు దూరముగా నుండి ఆత్మసుఖమునకు ప్రయత్నించును. శ్రద్ధ మానవుని తల్లివలె రక్షించును. కొందరియందు శ్రద్ధయను దంభము ఉండును. వారు నలుగురి ఎదుటను దేవుడు రచించిన వేదములును, శాస్త్రములును సత్యములని చెప్పెదరు. కాని ఆశాస్త్రములయందు చెప్పబడిన అను ష్ఠానమున వారు ప్రవర్తించరు. ఏలనన, శాస్త్రములయందు వారికి అంతరికమగు శ్రద్ధ లేదు. శ్రద్ధలేనివారు శాస్త్రములయందు ప్రవృత్తిని కలిగియుండరు. దేహేంద్రియాదుల సుఖమును ప్రత్యక్షముగా అనుభవించినవారికి వానియందు ఇంకను ఆసక్తి పెరుగును. అదేరక మగు సుఖమును అనుభవించుటకు ప్రయత్నించెదరు. నేను ఆత్మను. శరీరము వేరు, ఆత్మ వేరు అను భిన్నజ్ఞానము కలిగి సత్యజ్ఞానాభావ ముచే ఆత్మకళ్యాణమునకు ప్రవర్తించరు. ఎట్లన:—

ఒక సదాచారపరాయణుడును, విద్వాంసుడును అగు బ్రాహ్మ ణుని కుమారుడు విదేశమున ఉండెను. అతడు పూర్వజన్మకర్మమున విదేశమున చరిత్రహీనుడయ్యెను. ఈసంగతి తండ్రికి తెలిసి కుమారు నికి ఇట్లు ఉత్తరము వ్రాసెను. "ప్రియపుత్రా! వామదేవా! నీవు విదేశమున నీకులప్రతిష్ఠను, సదాచారములను త్యజించితివి అని విను చున్నాను. ఇది నిజమయినచో నీవు మహాపాపము చేసితివి. అయిన దేదియో అయ్యెను. ఇప్పుడైనను పశ్చాత్తాపమును పొంది నీ కుల ధర్మమును, సదాచారమును ఆచరించుము." ఈఉత్తరమును విదేశ మునందున్న కుమారుడు హృదయమునకు చేర్చుకుని, కండ్లకు అద్దు కొనుచుండెను. ఇది చూచి స్నేహితుడు అడిగెను. "నీవు ఇదేమి చేయుచున్నావు." అతడు సంతోషముతో ఇట్లనెను:—

"నా పూజ్యులగు తండ్రిగారి ఆజ్ఞాపత్రము. దానిని నేను కండ్లకు అద్దుకొనుచున్నాను." ఇట్లు అతడు ఆ ఉత్తరమును ఎంతయో ఆదరించెను. కాని దానిలోనున్న ఒక్క అక్షరమైనను అతడు ఆచరణలోనికి తీసికొనిరాలేదు.

ఈవిధముగనే నేటి జనులు గీత, ఉపనిషత్తులు మొదలగు ధర్మగ్రంథములను పూజావేదికపైనుంచి పూజించెదరు, పఠించెదరు. అనంతరము కండ్లకు అద్దుకొనెదరు. తలపై ధరించెదరు. కాని వాని యందలి ఆజ్ఞలలోనుండియు, వచనములలోనుండియు ఒక్కటైనను పాలించరు. శ్రద్ధ లేకపోవుటయే కారణము.

శ్రద్ధాహీనుడు జ్ఞానమును పొందలేడు. శ్రద్ధాశీలుడు ఈశ్వరునియందును, ఈశ్వరప్రోక్తములగు వేదములయందును శ్రద్ధను కలిగి విషయానందమున ప్రవర్తించడు.

త్రిభు :— అయిన ఈ శ్రద్ధ ఎట్లు కలుగును?

## శ్రద్ధకలుగుటకు మార్గము.

స్వా. హ్రి॥ :— శ్రద్ధకలుగుటకు శంకరులు మార్గమును బోధించిరి:—

*యథార్థవాదినాం పుంసాం శ్రద్ధాజననకారణమ్।*
*వేదస్యేశ్వరవాక్యత్వాద్యథార్థత్వే న సంశయః॥*

"నిజము చెప్పువారియందు శ్రద్ధ కలుగును. వేదము ఈశ్వర ప్రోక్తము. ఆకారణముచే దాని యథార్థత్వమునందు సంశయము లేదు." ఎవడైన అమెరికావెళ్ళి, చాలధనము సంపాదించి వచ్చినచో అమెరికాగురించి అతడు ఏమి చెప్పినను అది నమ్మెదము. ఏలనన అతడు అమెరికాలో ఎంతయో శ్రమపడి చాలధనమును సంపాదించెను.

తనకు యోగసిద్ధి కలిగినతరువాత భర్తృహరి అరణ్యమున సంచరించుచున్నప్పుడు అనేకమంది యోగాభ్యాసము చేయువారిని

సాధువులను చూచెను. వారు మందవైరాగ్యము పొందినందున అభ్యాసముచేయుచున్నను శాస్త్రమునందు చెప్పినట్లు బ్రహ్మసుఖమును అనుభవించలేదు. శాస్త్రమునందలి అశ్రద్ధచే వారి అభ్యాసమునందు శైథిల్యము జరిగెను. అంతకంతకు వారికి సుఖానుభవమునందు అభిలాష మెండయ్యెను. అట్టివారిని ఉద్దేశించి భర్తృహరి ఈశ్లోకము చెప్పెను:—

*బ్రహ్మేన్ద్రాదిమరుద్గణాంస్తృణకణాన్ యత్ర స్థితో మన్యతే*
*యత్స్వాదాద్విరసా భవన్తి విభవాః త్రైలోక్యరాజ్యాదయః।*
*భోగః కోపి స ఏక ఏవ పరమో నిత్యోదితో జృమ్భతే*
*భో సాధో! క్షణభఙ్గురే తదితరే భోగే రతిం మా కృథాః॥*

"ఆత్మతత్వమునకు చేరినవాడు బ్రహ్మ, ఇంద్రుడు మొదలగు దేవతలను తృణకణములుగా తలచును. దానిని ఆస్వాదంచినచో త్రిభువనరాజ్యము, వైభవములు సారహీనములుగా తోచును. సత్యమగు పరమభోగము ఒకటే. ఓసాధువులారా! ఈ ఆత్మభోగాతిరిక్తమగు క్షణికమగు విషయభోగమునందు ప్రేమను చూపవద్దు."

## సంతుల వాక్యములను వినిన శ్రద్ధ కలుగును.

మహారాష్ట్రదేశమునందు ఒక సంతు ఉండెడివాడు. ఆయన గొప్పత్యాగి. నదీతీరమునందలి ఒక నిర్జనప్రదేశమున ఆయన నివసించెడివాడు. సమీపగ్రామమున ఒక బీద బ్రాహ్మణుడు నివసించెడివాడు. ఆయన పురాణకాలక్షేపముతో కుటుంబపోషణము చేసికొనెడివాడు. ఆబ్రాహ్మణుడు చాలపవిత్రుడు. రోజులు గడచినకొలది ఆయన చాలదరిద్రుడు అయ్యెను. తన కుటుంబమును ఎట్లు నిర్వహింపగలను అను చింత అతనిని వేధించసాగెను. సమీపగ్రామమున ఉన్న మహాత్ముడు ఏదైనా ఉపాయము చెప్పును అను నమ్మకముతో ఆయనవద్దకు వెళ్ళి తన దుఃఖమును వెళ్ళబోసుకొనెను. ఆ

సంతు జవాబు చెప్పెను. నీస్థితిచూచిన నాకు చాలదుఃఖము కలిగినది. కాని ఏమిచేయుదును? నీకు సహాయముచేయు పరిస్థితిలో లేను. ఏలనన నావద్ద ధనములేదు. నేను సంసారమును విడచితిని. ఇది విని ఆబ్రాహ్మణుడు నిరాశతో మహాత్మునికి నమస్కారముచేసి బయలుదేరెను. పది పదిహేను అడుగులు వెళ్లగనే మహాత్ముడు మరల అతనిని వెనుకకు పిలచెను. ఆసంతు ఇట్లనెను:- నేను మరచితిని. చాల రోజులక్రితము స్నానము చేయుచుండగా నాకు ఒక స్పర్శమణి దొరకినది. దాని అవసరము నాకు లేదు ఏబీదవానికైన ఉపయోగించుననను ఊహతో ఒక చెట్టుతొర్రలో పడవేసితిని. నీవు నాతో రమ్ము. స్పర్శమణిని నీకు ఇచ్చెదను. దానితో నీదరిద్రము పోవును. స్పర్శమాత్రమున ఇనుమును బంగారముగా మార్చుశక్తి దానికి గలదు. ఆ బీద బ్రాహ్మణుడు, మహాత్ముడు ఇరువురు ఆచెట్టువద్దకు వెళ్లిరి. దాని పాతతొర్రనుండి ఒక మణిని వెలుపలికి తీసి ఆమహాత్ముడు బ్రాహ్మణునకు ఇచ్చెను. "ఇదిగో తీసికొనుము, విచారమును విడనాడుము. ఈ స్పర్శమణి నీ దరిద్రమును పోగొట్టును." అని మణిని ఇచ్చెను. బ్రాహ్మణుడు ఆశ్చర్యచకితుడయి స్పర్శమణితో సమానుడగు ఆ మహాత్ముని తదేకదృష్టిని చూడసాగెను. పిదప ఇట్లు పలికెను. "ఓమహాత్మా! ఓ దయాసముద్రా! నేడు నాకండ్లు తెరువబడినవి. ఈస్పర్శమణి చాల విలువకలవస్తువు. కాని అది మీకెందుకు. మీకు ఆత్మసుఖమను చింతామణి లభించినది. ఆచింతామణి ఎదుట ఈస్పర్శమణి పనికిరాని రాయివలె తోచినది. కావుననే దీనిని మీరు ఈ తొర్రలో పడవేసిరి. ఇకనాకు స్పర్శమణితో పనిలేదు. తమరు నాకు అద్వితీయసుఖమను మణిని (ఆత్మసుఖమను మణిని) ఇవ్వండి." ఇట్లు పలికి అతడు తన చేతిలోనున్నమణిని ఎదుట ప్రవహించుచున్న నదిలోనికి విసరివేసి ఆయన కాళ్ళు పట్టుకొనెను.

ఆత్మసుఖము ఎదుట ప్రపంచమునందలి మిగిలిన సుఖములు అన్నియు రసహీనములుగా తోచును. ఇచేవిధముగా సంతువాక్యములు సత్యములైనందున బ్రాహ్మణునియందు శ్రద్ధ జనించినది.

ఈశ్వరప్రోక్తములగు వేదశాస్త్రములయందలి
శ్రద్ధచే ధర్మాచరణము సిద్ధించును.

"వేదము ఈశ్వర వాక్యము. కావున దాని సత్యత్వమునందు సంశయములేదు." అను ఈ మూలశ్లోకమును గురించి శ్రుతి ఇట్లు చెప్పుచున్నది.

అస్య మహతో భూతస్య నిఃశ్వసితమేదద్యద్ ఋగ్వేదో యజుర్వేదః సామవేదో ఽథర్వవేదః ।

"ఋగ్వేదము, యజుర్వేదము, సామవేదము, అథర్వవేదము ఈమహాపరమాత్ముని నిశ్వాసరూపములు."

ఈవిధముగా వేదశాస్త్రములు ఈశ్వరప్రోక్తములు అను శ్రద్ధ కలిగినచో అనంతరము ధర్మాచరణమునందు శ్రద్ధ కలుగును. ఈవిషయమున శంకరులు ఇట్లు చెప్పుచున్నారు:—

*శ్రద్ధావిహీనస్య తు న ప్రవృత్తిః ప్రవృత్తిశూన్యస్య న సాధ్య సిద్ధిః।*
*అశ్రద్ధయైవాభిహతాశ్చ సర్వే మజ్జన్తి సంసారమహాసముద్రే ॥*

"శ్రద్ధలేనిచే నరునకు ధర్మమునందు ప్రవృత్తి కలుగదు. ప్రవృత్తి లేనిచే లక్ష్యసిద్ధిలేదు. అట్టి జనులు అందరు అశ్రద్ధచే దెబ్బతినినవారే. వారు సంసారసాగరమున మునిగిపోవుటయే జరుగును."

సంధ్యావందనాది కర్మలు చేయువారు చాలమంది కలరు. కాని వారియందు శమదమాదిసాధనములు కనపట్టవు. కర్మలయందు నిజమగు శ్రద్ధయు, దంభరాహిత్యము ఉన్నచో వాని పరిణామమగు అంతఃకరణశుద్ధి కలిగితీరును.

## గుణగ్రహణదృష్టి అవసరము.

స్వా. ని. :—త్రిభువనభాయిని ఇట్లు అడిగిరి:— నీవు శాస్త్రములను చదివితివా?

త్రిభువన :—లేదు. నే నేశాస్త్రములను చదువలేదు. కాని చాలమంది మహాత్ములతో సంసర్గము నొందుటచే నేను వారి ఉపదేశములను వినియుంటిని. ప్రతిచోట నాకు రజోగుణప్రవృత్తి కాన్పించినది. అందుచే నాకెవ్వరియందును శ్రద్ధ కలుగలేదు. ఇట్లు అశ్రద్ధ నాకు కలుగుటచే నాదృష్టి అశ్రద్ధదోషముతో మలినమైనది.

స్వా. ని. :—భగవంతునియందు తప్ప మిగిలినవారి అందరియందును గుణములతోబాటు అవగుణములు కూడ ఉండును. కాని మీరు గుణములనే చూడుడు. అవగుణములను విడనాడుడు.

## దుస్సంగముచే అనిష్టము కలుగును.

త్రిభు:—అపగుణములు ప్రయత్నము చేయకుండగనే కన్పించును. అందుచేతనే నాకు ఎల్లెడల దంభము, దర్పము మొదలగునవి కన్పించుచున్నవి. ఎంత మంచిచోటికి వెల్లినను నాకు అనుమానము కలుగుచున్నది.

స్వా. ని. :—నీవు చెప్పినది దుస్సంగపరిణామము. అందుచేతనే శాస్త్రములో సత్పురుషసమాగమము చేయవలెనని చెప్పబడినది.

## సత్సంగమాహాత్మ్యము.

శ్రీమద్భాగవతమున ఇట్లున్నది :—

*సంగం త్యజేత మిథునవ్రతినాం ముముక్షుః*
*సర్వాత్మనా న విసృజేద్బహిరింద్రియాణి ।*
*ఏకశ్చరన్ రహసి చిత్తమనన్త ఈశే*
*యుఞ్జీత తద్వ్రతిషు సాధుషు చేత్ప్రసంగః ॥*

"ముముక్షువు విషయాసక్తులగు స్త్రీపురుషుల సాంగత్యము పూర్తిగా విడనాడవలెను. చక్షురాది ఏకాదశేంద్రియములను విషయములనుండి తప్పించుటకు పూర్తిగా ప్రయత్నించవలెను. ఏకాంతముగనుండి అనంతుడగు విష్ణుభగవానునియందు చిత్తమును లగ్నము చేయుము. స్నేహము చేయవలసివచ్చినచో శ్రీమహావిష్ణువంటి మనస్సుకల సాధువుల సాంగత్యము మాత్రము చేయుము."

స్వా. ప్ర॥ :— భాగవతమునందు మరియొకచోటకూడ భగవానుడు చెప్పెను:—

*సంగం న కుర్యాదసతాం శిశ్నోదరతృషాం క్వచిత్ ।*
*తస్యానుగస్తమస్యన్ధే పతత్యన్ధానుగాన్ధవత్ ॥*

"విషయభోగములందుమాత్రము తృప్తినికాంచు అసత్పురుషుల సాంగత్యము ఎప్పుడును కూడదు. వారిని అనుసరించువాడు ఘోరమగు అంధకారమును పొందును. గుడ్డివానివెనుక వెళ్ళు గుడ్డివానిగతి మరి ఏమగును?

*తతో దుస్సంగముత్సృజ్య సత్సు సజ్జేత బుద్ధిమాన్ ।*
*సన్త ఏతస్య ఛిన్దన్తి మనోవ్యాసంగముక్తిభిః ॥*

"అందుచే దుఃసంగమును త్యజించి బుద్ధిమంతుడు సాధుపురుషుల సాంగత్యమును కోరవలెను. సత్పురుషులు తమ సదుపదేశములచే ఇతరుల మనస్సులయందలి విషయాసక్తిని పోగొట్టెదరు."

## సంతుల లక్షణము.

సంతుల లక్షణములను ఉద్ధవుని సందేహమునకు సమాధానము చెప్పుచు భగవానుడు ఇట్లు వివరించెను:—

*సన్తోఽనపేక్షా మచ్చిత్తాః ప్రశాన్తాః సమదర్శినః ।*
*నిర్మమా నిరహంకారా నిర్ద్వన్ద్వా నిష్పరిగ్రహాః ॥*

"సంతులు కోరికలు లేనివారు. వారి మనస్సు నాయందు లగ్నమయి ఉండును. ప్రశాంతముగ నుందురు. సమదృష్టి కలిగి యుందురు. మమత్వము, అహంకారము, సుఖదుఃఖాదిద్వంద్వములు లేనివారు. వాగు పరిగ్రహము చేయరు."

అనపేక్షః— వారికి కోర్కెలు లేవు. ప్రపంచదుఃఖములనుండి నివృత్తిని పొందుటకు పరమాత్మయే ఆశ్రయమని నమ్మినవారు. పరమాత్మనితప్ప మరియొకపదార్థమును కోరరు. ప్రారబ్ధమునకు అధీనుడయినను ఈశ్వరపరాయణుడగు ముముక్షువునకు తన యోగక్షేమములనుగురించి విచారము కలుగదు. తనయోగక్షేమములభారము ఈశ్వరునిపై విడచిపెట్టును. "యోగక్షేమం వహామ్యహమ్" అని భగవానుడే స్వయముగా చెప్పెను కదా! ఇతరచింతలను త్యజించి నాయందే భక్తికల మానవుని యోగక్షేమములు తానే చూచెదనని శ్రీకృష్ణుడు చెప్పెను.

మచ్చిత్తాః :— దేవునియందు మనస్సును లగ్నముచేసినవారు. పరమాత్మని భక్తుల మనస్సు పరమాత్మనియందుమాత్రమే లగ్నమయి ఉండును. సాంసారికపదార్థములయందు మనస్సు లగ్నమయి ఉన్నంతవరకు పరమాత్మనియందు మనస్సు లగ్నమగుటకు అవకాశము లేదు. రాజునౌకరులు రాజుపనియే చేయుచున్నను వారిప్రేమ తమ కుటుంబములపైననే ఉన్నంతకాలము వారు రాజభక్తులు అని చెప్పబడరు. అటులనే పరమాత్మని సేవకుల మనస్సు సాంసారికపదార్థములయందు ఉన్నంతకాలము పరమాత్మని భక్తులని చెప్పబడజాలరు. రాజనౌకరులవలె స్వార్థబుద్ధికలవారనియే చెప్పబడుదురు. కావున పరమాత్మని భక్తుల మనస్సు పరమాత్మనియందే ఉండును.

ప్రశాన్తాః :—భక్తుల చిత్తము రజోగుణ, తమోగుణ దోషములకు దూరముగా నుండుటచే వారిచిత్తమునందు రాగద్వేషములు

ఉండవు. వసంతఋతువునందు మందమారుతము వీచుచున్నప్పుడు సుందరోద్యానమునందలి వృక్షచ్ఛాయయందు కూర్చొనియున్న మానవునకు సూర్యాతపము తగలదు. అటులనే పరమాత్ముని ధ్యానాది సాధనములచే లభించిన ఆయన కృపయనెడు శీతలకిరణముచే ఎవరి అంతఃకరణమునందలి తాపము నివృత్తిని చెందునో వారి హృదయమున రాగ, ద్వేష, మద, మాత్సర్యాది దోషములు ఉండవు. అందుచే ఉద్రేకములు కలుగవు. కావున ఈశ్వరభక్తులు శాంతముగనే ఉందురు.

సమదర్శనః :—తమ సుఖదుఃఖములు హర్షశోకములకు కారణమయినట్లుగనే ఇతరుల సుఖదుఃఖములుకూడ పరమాత్ముని భక్తుల హర్షశోకములకు కారణము లగును. ఆ కారణముచే ఈశ్వరభక్తు డెవ్వడును ఏప్రాణికిని మనో, వాక్, కర్మములచే దుఃఖమును కలుగజేయడు. ఆతడు ప్రాణులందరి సుఖదుఃఖములును సమానములని తలచును. ప్రాణులందరియందును అంతర్యామిరూపమున ఉన్న పరమాత్ముడు ఒక్కడే అని తెలిసికొనిన ఈశ్వరభక్తుడు ఏప్రాణికైన దుఃఖము కలుగజేయు సమయము కలిగినప్పుడు తాను పరమాత్మునికే దుఃఖము కలుగచేయుచున్నట్లు భావించును.

నిర్మమాః :—ఈశ్వరభక్తులు సర్వపదార్థములయందును, తమ శరీరమునందునుకూడ మమకారమును కలిగియుండరు. ప్రభువుచే సృష్టించబడిన పదార్థములన్నియు ప్రభువునకు సంబంధించినవియే. ఇతరుల ఆస్తిని ఏబుద్ధిమంతుడును తనదని చెప్పనట్లుగనే ప్రభుసృష్టియందలి పదార్థములను భక్తులు తమవిగా భావించరు. అజ్ఞానముచే పదార్థములయందలి కలుగు మమత్వమును పరిత్యజించుటకు భక్తి ఆత్మనివేదనపద్ధతిని ప్రతిపాదించును. ఆ కారణముచే పదార్థములన్నియు ప్రభునివి అని తలచి మమత్వమును పోగొట్టుకొనవలెను.

నిరహఙ్కారాః :— అహంకారము అసురసంపద. అసురసంపదకలవాడు భక్తుడు కాజాలడు. "నేను శ్రీమంతుడను, సత్కుల సంజాతుడను, విద్వాంసుడను, గుణవంతుడను" ఈ మొదలగు భావములతో గూడిన గర్వము ఎప్పుడును పరాజయమునకు కారణము.

దేవతలును, అసురులును యజ్ఞముచేయ నిశ్చయించిరి. అసురులు తాము ఎంతయో గొప్పవారమనియు, ఆ కారణముచే యజ్ఞమునందు వారుచేయు సంభారములు ఉత్తమముగా నుండవలెననియు తలచిరి. వారు తమంతట తామే గొప్పవార మనుకొనుటచే వారిలో వారికి పరస్పరము ద్వేషము ప్రబలిపోయెను. ఆ ద్వేషమునకు లోనయి యజ్ఞమునకు తీసికొనివచ్చిన సామగ్రినంతయు వారే తిని వేసిరి. పూజకొరకు ఎవరు ఏమియు చేయలేదు. దేవతలు యజ్ఞమునందు ఎవరిని పూజించవలెనని ఆలోచించిరి. ఒకరికంటె మరియొకరు వారికి గొప్పవారుగా తోచిరి. ఆ ఉద్దేశ్యముతో దేవతలు ఒకరిని ఇంకొకరు పూజించిరి. అంతట దేవాసురులకు యుద్ధము జరిగెను. అసురులు తమ గర్వకారణమున ఓడిపోయిరి. దేవతలు జయించిరి. అందుచే భక్తులు గర్వముతో నుండరు.

నిర్ద్వన్ద్వాః :— దేశ, కాల భేదములచే పదార్థములన్నియు మానవునకు సుఖదుఃఖములు కలుగజేయును. అయినను సత్పురుషులకు శీత– ఉష్ణ, సుఖ– దుఃఖ, రాగ–ద్వేషాది ద్వంద్వములు బాధించవు. ఏ ప్రాణిని శత్రుభావముతోగాని, మిత్రభావముతోగాని చూడరు. శీతోష్ణాదులచే బాధకలిగినను వారు విచారించరు. మద, మత్సర, కామ, క్రోధ, లోభ, మోహాదులకు లోనుగారు.

నిష్పరిగ్రహాః :— భోగసామగ్రిని సంగ్రహించరు. తన శరీరమునకు వలయు సామగ్రిని సంగ్రహించువానికి దేవునిపై శ్రద్ధ యుండదు పదార్థములసంగ్రహము గర్వము, మమత్వము, లోభము

మొదలగు అనేకములగు అనర్థములను కలుగజేయును. ఆకారణముచే పరిగ్రహము దుఃఖదాయకమని తలచి దత్తాత్రేయులు పరిగ్రహము చేయువారిని తేనెటీగతో పోల్చిరి. తేనెటీగ కొంచెముకొంచెము చొప్పున తేనెను ప్రోగుచేసి పట్టునందు నిలవచేయును. తేనెపట్టు తీసికొనువాడు పొగపెట్టియో, మరియొకవిధముగనో తేనెను తీసికొనిపోవును. అందు అనేకములుగా ఈగలుకూడ చనిపోవును సంగ్రహమునకు అలవాటుపడినవానికి ఇట్టి ఆపదకూడ ప్రత్యక్షముగా కన్పట్టును. అప్రత్యక్షదోషములు- రాగాదులు వృద్ధిపొందుట, లోభము, ద్వేషము మొదలగునవి అన్నియు పరిగ్రహముచేతనే కలుగును. ఆకారణముచేతనే ప్రాచీనకాలమునందు ప్రసిద్ధినిపొందిన కణాదాది ఋషులుకూడ ఉంఛవృత్తిని అవలంబించి జీవితమును గడిపెడివారు. ఒక్కొక ధాన్యకణమును ఏరుకొని దానిచే జీవితమును గడుపుకొనుట చేతనే ఆ ఋషికి 'కణాదు'డని పేరు కలిగెను.

## త్యాగికి పరిగ్రహము కూడదు.

త్రిభు:— అయితే సంగ్రహము చేయవలెనను వృత్తి కలుగుటకు కారణమేమి?

స్వా॥ ని॥ :— (స్వా. ప్రే. తో) స్వామీ, త్రిభువనభాయికి సందేహనివృత్తి కలుగజేయండి.

స్వా॥ ప్రే॥ :— పదార్థములయందు అవివేకము ఉన్నంత వరకు ద్రవ్యాదులను సంగ్రహించవలెనను కోరిక కలుగును.

*దదతి తావదమీ విషయాః సుఖం స్ఫురతి యావదియం హృది మూఢతా ।*
*మనసి తత్త్వవిదాం తు వివేచకే క్వ విషయాః క్వ సుఖం క్వ పరిగ్రహః॥*

"చిత్తమునందు ఈమూఢత్వము అవివేకము- ఉన్నంతవరకు విషయములు సుఖమును కలుగజేయునని తోచును. తత్త్వమును

గ్రహించిన వివేకి మనస్సునందు విషయములకు, సుఖమునకు, పరిగ్రహమునకు స్థానము లేదు.''

భర్తృహరి యోగసిద్ధిని పొందినతరువాత నిర్ద్వంద్వుడుగా అరణ్యములందు సంచరించుచుండెను. ఆసమయమున అచ్చట కొందరు సన్యాసులు మఠములు, ద్రవ్యము మొదలగునవి సంగ్రహించి పరిగ్రహముతో వైభవోపేతమగు జీవితమును గడపుచు కన్పడిరి. ఏమహాత్ముడైన వచ్చినను వారికి తమ ఆచరణమునకు సిగ్గు గలిగెడిది కాదు. ఇట్టి సన్యాసులను గురించి భర్తృహరి ఈశ్లోకములు చెప్పెను.

*కృమికులచితం లాలాక్లిన్నం విగన్ధి జుగుప్సితం*
*నిరుపమరసం ప్రీత్యా ఖాదన్నరాస్థి నిరామిషమ్ ।*
*సురపతిమపి శ్వా పార్శ్వస్థం విలోక్య న శఙ్కతే।*
*న హి గణయతి క్షుద్రో జన్తుః పరిగ్రహఫల్గుతామ్ ॥*

"పురుగుల పోగులతో నిండి, చొంగతోకూడి, కంపుకొట్టుచున్న, తుచ్ఛమగు, మాంసములేని మానవుని ఎముకను రసవత్తరమైనదిగా భావించి ప్రేమతో కొరుకుచు కుక్క తనచెంతనున్న దేవాధిపతి ఇంద్రునికూడ లక్ష్యముచేయదు. ఏలనన, క్షుద్రజీవి తాను గ్రహించిన వస్తువు ఎంత హీనమయినదో విచారించదు.

మానవుడు మద్యమును త్రాగుట మొదలగు నిషిద్ధకృత్యములను ఆచరించునప్పుడు సామాన్యజనులు ఎవరైన తనను చూచినచో సిగ్గుపడును. ఆమద్యపానము చేయువాడే చాలక్షుద్రుడగు జనుడెవడైన అగుచో ఎంత గౌరవవంతుడు చూచుచున్నను సిగ్గుపడడు. కుక్క ఇంద్రునికూడ లక్ష్యముచేయదు అని చెప్పబడినది. ధనాదులను సంగ్రహించు క్షుద్రసన్యాసులు మహాత్ములు చూచుచున్నను సిగ్గుపడరు. కావుననే భర్తృహరి అట్టి సన్యాసులను కుక్కతో పోల్చెను.

ఇంతవరకు సన్యాసికి పరిగ్రహము కూడదని తెలుపబడినది. గృహస్థులుమాత్రము హద్దులకు లోబడి పరిగ్రహమును చేయవచ్చును. ఎట్లన:—

కుసూలధాన్యకో వా స్యాత్ కుమ్భీధాన్యక ఏవ వా,
త్ర్యైహికో వాపి భవేదశ్వస్తనిక ఏవ వా॥

"ధాన్యమును గాదెనిండ నింపి ఉంచుకున్నవానికంటె కుండెడు ధాన్యము నిలవచేయువాడు ఉత్తముడు. మూడురోజులకు మాత్రమే సరిపడు ధాన్యము నిలవచేయువాడు అంతకంటెను శ్రేష్ఠుడు. రేపటికి మాత్రమే సరిపడు ధాన్యమును నిలవజేసికొనువాడు వీరికంటె మరింత శ్రేష్ఠుడు. రేపటికికూడ మిగల్చుకొననివాడు వీరిఅందరికంటెను ఉత్తమోత్తముడు. ధాన్యమును నిలవచేయుటకే పూర్వకాలము ఇంత కఠోరనియమములు ఉన్నచో ఇంక మిగిలినవస్తువులు దాచుకొనరాదని చెప్పవలసిన పని ఏమి ఉన్నది?

త్రిభువ:—కొందరు ఇట్లుకూడ చెప్పుదురు. జ్ఞానికి దేహమునందు అహంకార, మమకారములు ఉండవు.అందుచే వారు "అహం"ను విడనాడి విషయాదులను అనుభవించినను, మమత్వమును త్యజించి వస్తువులను సంగ్రహించినను దోషము లేదు.

స్వా. ప్ర. :—అహం లేనిదే ఏ పనియు చేయబడదు. భగవత్స్వరూపులగు ఆచార్యుల వచనములు వినుడు.

దేహాత్మనా సంస్థిత ఏవ కామీ విలక్షణః కామయితా కథం స్యాత్,
అతోఽర్థసంధానపరత్వమేవ భేదప్రసక్త్యా భవబన్ధహేతుః॥

"భ్రాంతిచే దేహాత్మభావన ఉండుటచేతనే విషయేచ్ఛలు కలుగుచున్నవి. దేహాదులయందు అహంబుద్ధి లేకుండ ఉన్నచో విషయేచ్ఛలు ఎట్లు కలుగును? కావున అహంకారమను భేదబుద్ధి ఉత్పన్నమగుటద్వారా విషయచింతనమందు నిమగ్నమగుటయే సంసారమనెడు బంధములకు హేతువు."

దేహమునందు అహంబుద్ధి ఉన్నంతవరకు విషయాదులను అనుభవించు కోరిక కలుగును. అందు నరుడు ప్రవృత్తుడుకూడ నగును. పదార్థములయందు సత్యత్వబుద్ధియును, రమణీయభావమును ఉన్నంతకాలము పదార్థములు అనుభవించవలెనని కోరిక కలుగును. ఏలనన, ప్రారంభమున అజ్ఞానదశలో జగత్తు సత్యముగానే గోచరించును. కాని అధిష్ఠానజ్ఞానము కలిగినతరువాత జ్ఞానికి జగత్తు భాసించినను, దానియందలి సత్యత్వము భాసించదు. అందలి సుఖబుద్ధి పోవును. అట్లు జగత్తుచే సుఖము కలుగునను భావము పోవుటచే మానవుడు అందు ప్రవర్తించడు. ఈవిషయమున అష్టావక్రగీతయందు గురుశిష్యసంవాదమున ఇట్లు చెప్పబడినది.

అవినాశినమాత్మానమేకం విజ్ఞాయ తత్త్వతః।
తవాత్మజ్ఞస్య ధీరస్య కథమర్థార్జనే రతిః॥

"ఆత్మ ఒకటియే. అది అవినాశి. ఈవిషయమును యథార్థముగా తెలిసికొని ఆత్మజ్ఞానమును పొందిన ధీరునకు- అనగా పట్టుదల కలవానికి ధనసంపాదనమునందు ప్రేమ ఎట్లు కలుగును?"

ఆత్మాజ్ఞానాదహో ప్రీతిర్విషయభ్రమగోచరే।
శుక్తేరజ్ఞానతో లోభో యథా రజతవిభ్రమే॥

"ఆత్మజ్ఞానము కలుగనందున విషయములయందు భ్రాంతిచే ప్రేమ కలుగును. ముత్యపుచిప్పను అజ్ఞానముచే వెండి అనుకొనెదము. అంతట లోభము కలుగును." ఆవిధముగా లోభము కలిగినంత కాలము పూర్తిగా జ్ఞానము కలిగినదనుటకు వీలులేదు. జ్ఞాని విషయములకు దూరముగ నుండును. విషయాసక్తుడు జ్ఞాని కాడు. ఏలనన, జ్ఞానముతోబాటు వైరాగ్యము కలుగును. ధూమము ఉన్న ప్రతిచోటను అగ్ని ఉన్నట్లు జ్ఞానముకల ప్రతిచోటను వైరాగ్యము ఉండును. జిజ్ఞాసుదశయందే పూర్ణవైరాగ్యము కలుగునప్పుడు జ్ఞానదశ

గురించి వేరుగా చెప్పనేల?అమృతపానము చేసినవాడు మజ్జిగ త్రాగ వలెనని ఎప్పుడైన కోరునా? అటులనే బ్రహ్మానందమును అనుభవించిన జ్ఞాని తుచ్ఛములగు విషయములను కోరడు.

శ్రీభ:—నేను ఒకస్వామివారి దృష్టాంతము చెప్పుచున్నాను. శ్రీరామదాసస్వామివారి శిష్యులు కళ్యాణస్వామి రాజధాని యగు సతారాలో రాజవైభవముతో ఉండెడివారు. జనులు రామదాసస్వామివారివద్దకు వెళ్ళి "అయ్యా, తమరు పూర్ణవైరాగ్యవంతులు. తమ శిష్యులు సతారాలో పూర్ణవైభవములతో రాజవైభవమును అనుభవించుచున్నారు. ఇది తగునా?" అని అడిగిరి.

అంతట రామదాసుగారు సతారా వెళ్లి కల్యాణునితో ఇక్కడ నీకు పనిలేదు. నాతో రమ్ము అని పలికిరి. కళ్యాణస్వామి వారు రామదాసుగారిని వెంబడించిరి. వారు పదిపన్నెండు క్రోసులను దాటినతరువాత సాయంకాలమైనందున ఒకవృక్షముక్రింద విశ్రమించిరి. కల్యాణస్వామి ఎప్పుడును నడువలేదు. అందుచే అలసిపోయి పరుండినవెంటనే నిద్రించెను. ప్రాతఃకాలము సమీపించినతరువాత రామదాసస్వామి నిత్యకృత్యములను ఆచరించుటకు లేచిపోయెను. కాని కల్యాణస్వామి సూర్యోదయము అయినతరువాతకూడ నిద్రించుచునే యుండెను. ఇంతలో సతారానుండి ఒక సైనికులగుంపు ఏదియో పనిమీద బయటకు వచ్చెను. వారికి దాహమువేసి కళ్యాణస్వామి నిద్రించుచున్న ప్రాంతమున నూయి ఉండుటచే అక్కడకే వచ్చిరి. సైనికులు కళ్యాణస్వామి ఇట్లు నేలపై పరుండుట చూచి ఆశ్చర్యపడిరి. వెంటనే ఆవిషయమును కొంచెదిదూరమున ఉన్న తమ అధికారికి నివేదించిరి. అధికారి అక్కడికి వచ్చెను. అతడు కళ్యాణస్వామిని గుర్తుపట్టి సేవకులకు ఇట్లు ఆజ్ఞాపించెను. "స్వామివారికి నిద్రాభంగము కలుగకుండ ఒకడేరా ఆయనపైన వేయుడు. బైట

ఫహారా ఇచ్చుచు ఉండుడు." ఇంతలో నిత్యానుష్ఠానములు నిర్వ ర్తించుకొని రామదాసుగారు వచ్చి ఈజరుగుచున్న దృశ్యము నంతను గమనించిరి. వారు డేరాలోనికి వచ్చి కళ్యాణస్వామితో నిట్లుచెప్పిరి. "కళ్యాణ్, నీప్రారబ్ధము భోగములయందు ఉన్నది. నీవు వీరితో రాజ ధానికి వెళ్ళుము." ఇట్లు పలికి రామదాసుగారు అరణ్యములోనికి వెళ్ళిపోయిరి. కళ్యాణస్వామి రాజధానికి వెళ్లిపోయెను.

స్వా. ప్రి.:—నిజమునకు ఈదృష్టాంతము కల్పించినది. కళ్యాణస్వామి రాజధానియందు ఉండెడివారునుకారు, భోగములును అనుభవించెడి వారును కారు. ఆయన తనగురువుగ్గారిని సేవించుచునే యుండెడివారు. విషయలంపటులగు విద్వాంసులు తమ చెడునడత లను సమర్థించుకొనుటకు ఇట్టి కాకమ్మకథలను అల్లిరి. సామాన్యజను లకు ఇట్టి దృష్టాంతములను తెలిపి, వారు మాప్రారబ్ధమునందు భోగ ములు వ్రాయబడియున్నవి అని చెప్పి తాము గొప్పవారమని రుజువుచేసికొనెదరు. ఇదియే నిజమైనచో ప్రారబ్ధలబ్ధమగు రాజ్యమును విడచి భర్తృహరి మొదలగు మహారాజులు వనములయందు నివసిం చుట ఎట్లు? అట్లు నివసించినప్పుడు వారివెంట రాజ్యము వెళ్ళలేదే! ప్రార బ్ధము దేహగతములగు రోగాదిసుఖదుఃఖములతో సంబంధించి ఉం డును. దానికిని బాహ్యపదార్థములకును సంబంధము లేదు.

త్రిభువనభాయి:— జ్ఞాని భిక్షాటనమునకు వెళ్ళినప్పుడు ఎవ డైన రుచికల మృష్టాన్నములు భిక్షలో ఇచ్చినచో జ్ఞాని బాధ పడునా?

స్వా. ప్రి. :— అజ్ఞాని రకరకములగు మృష్టాన్నములయం దును, అన్నపానాదులయందును ప్రేమ కలిగియుండును. జిజ్ఞాసువునకు రుచిగల పదార్థములయందు ప్రేమయుండదు. జ్ఞాని సమయమునకు దొరకినదానిని ప్రేమకాని, ద్వేషముకాని లేకుండ శరీరనిర్వాహణము నకు మాత్రమే భుజించును. భగవద్గీతయందు చూడుడు:—

*నిరాశీర్యతచిత్తాత్మా త్యక్తసర్వపరిగ్రహః,*
*శారీరం కేవలం కర్మ కుర్వన్నాప్నోతి కిల్బిషమ్॥*

"ఆశారహితుడై, చిత్తమును, దేహేంద్రియాదికమును జయించినవాడు సర్వవిధములగు పరిగ్రహములను— ధనాదులను సంపాదించుటను త్యజించును. ఆతడు శరీరనిర్వాహణమునకుమాత్రమే అవసరమగు భోజనాదికర్మములు చేయుటచే ఆతనికి పాపము కలుగదు."

ప్రశ్న:—యాజ్ఞవల్క్యమహర్షి గృహస్థాశ్రమమునందుండెను. ఆయనకు ఇద్దరు భార్యలు. ద్రవ్యాదులను సంపాదించుచుకూడ ఉండెను. జనకమహారాజుకూడ రాజ్యభారమును నిర్వహించుచుండెను. పెద్దధనాగారమును కలిగియుండెను. అయినను వీరు ఇరువురును జ్ఞానులుగా చెప్పబడిరి. అది ఎట్లు?

స్వా. వ్రి. :— నేను క్రీ॥ శ॥ 1900 సంవత్సరమున హృషీకేశమునందుంటిని. అచ్చటి తపోవనమునందు కొందరు సన్యాసులు సత్సంగముచేయుచు "ఆత్మసాక్షాత్కారముకొరకు సన్యాసము అవసరమా? కాదా?" అని చర్చించిరి.

వారిలో ఒక సన్యాసి ఇట్లడిగెను:— "కొందరు గృహస్థులు ఇంటిలో కూర్చొని యోగాభ్యాసము చేసినను కూడ ఆత్మజ్ఞానము కలుగునని తలచెదరు. వారు సన్యాసముతీసికొని అరణ్యమునకు వెళ్ళనవసరములేదని అనుకొనెదరు. ఏలనన, వనమునందు పశువులుకూడ ఉండును. అవి తపశ్శాలురేమి కావుకదా! అటులనే కాషాయమును ధరించి భిక్షనడిగికొని తినువాడు ఆత్మజ్ఞాని కాడు. పైగా యాజ్ఞవల్క్య, జనకాదులు గృహస్థాశ్రమమునందు ఉండియే జ్ఞానమును పొందినచో సన్యాసము తీసికొనవలసిన అవసరమేమి?"

రెండవ సన్యాసి :—"విషయలాలసతను త్యజించుటయందు తితిక్షను అలవరచుకొనలేనివారు అట్లు తలచెదరు. అట్లుకానిచో ప్రబల

మగు విషయాసక్తినుండి నివృత్తిని పొందుటకు తితిక్ష ను వహించి తపస్సు చేయవలెను. కుటుంబమునకు దూరముగనుండి ఈశ్వరభజన చేయనిదే ఎవడును మోహరహితుడు కాడు. అంతేకాకుండ యాజ్ఞవల్క్యుడు, జనకుడు నిజముగా శాస్త్రములు తెలిసి నవిద్వాంసులు. జ్ఞానులు కారు. జ్ఞానమును పొందవలెనని కోరిక కలిగినప్పుడు వారిరువురును సన్యాసము స్వీకరించవలెనను కోరిక కలిగినట్లు శాస్త్రప్రమాణము కలదు. బృహదారణ్యకమునందు ఈసంగతి అందగు పడుచున్నది.

యాజ్ఞవల్క్యునకు సన్యాసము తీసికొనవలెనని కోరిక కలిగినప్పుడు తన ఇద్దరు భార్యలను వారివారి భాగములను పంచి ఇవ్వవలెనను కోరికతో పిలచెను. చిన్నభార్య కాత్యాయని అర్ధభాగము తీసికొనుటకు సంసిద్ధురాలయ్యెను. కాని పెద్దభార్య మైత్రేయి ఇట్లడిగెను:- ఈధనమువలన ఏమి లాభము కలుగును? యాజ్ఞవల్క్యుడు చెప్పెను. "సుఖభోగములను అనుభవించవచ్చును." అంతట మైత్రేయి ఇట్లనెను. "అమృతత్వము లభింపజేయని ధనము నాకెందుకు?" ఆమె ధనము తీసికొనలేదు. అనంతరము యాజ్ఞవల్క్యుడు సన్యాసము తీసికొనెను.

జనకుడుకూడ శాస్త్రజ్ఞుడే. ఆయన వృద్ధాప్యమున కుమారునికి రాజ్యము ఒప్పగించి సన్యాసమును స్వీకరించెను. ఇందుకు మహాభారతమున ప్రమాణము కలదు.

*1. స ఏవమనుశిష్టస్తు యాజ్ఞవల్క్యేన ధీమతా ।*
*ప్రీతిమానభవద్రాజా మిథిలాధిపతిస్తదా ॥*

*2. గతే మునివరే తస్మిన్ కృతే చాపి ప్రదక్షిణమ్ ।*
*దైవరాతిర్నరపతిరాసీనస్తత్ర మోక్షవిత్ ॥*

3. వైదేహరాజ్యం చ తదా ప్రతిష్ఠాప్య సుతస్య వై।
యతిధర్మముపాసంశ్చాప్యవసన్మిథిలాధిపః॥

4. ధనాన్యపత్యదారాంశ్చ రత్నాని వివిధాని చ।
పన్థానం పావకం హిత్వా జనకో మౌణ్ఢ్యమాస్థితః॥

5. తం దదర్శ ప్రియా భార్యా భైక్ష్యవృత్తిమకించనమ్।
ధాన్యముష్టిముపాసీనం నిరీహం గతమత్సరమ్॥

6. తత్స్వ్రజ్య రాజ్యం భైక్షార్థం కృతబుద్ధిం నరేశ్వరమ్।
విదేహరాజమహిషీ దుఃఖితా యదభాషత॥

7. య ఇమాం కుణ్డికాం భిన్ద్యాత్ దణ్డం తవ చ యో హరేత్।

వాసశ్చాపి హరేత్తస్మిన్కథం తే మానసం భవేత్॥

1. యాజ్ఞవల్క్యుడు ఇట్లు ఉపదేశించినపిదప మిథిలాధిపతి సంతోషించెను.

2. మోక్షసాధనమును తెలిసికొనిన దేవరాతుని కుమారుడగు జనకుడు యాజ్ఞవల్క్యమహర్షికి ప్రదక్షిణాదులు చేసెను.

3. ఋషి వెళ్లిపోయినతరువాత రాజ్యమును కుమారునకు ఇచ్చివేసి జనకుడు సన్యాసాశ్రమమును స్వీకరించెను.

4. ధనము, భార్య, బిడ్డలు, వివిధైశ్వర్యములు, గృహస్థధర్మమునకు చెందిన అగ్నిహోత్రాదులను విసర్జించి జనకుడు ముండనము చేయించుకొనెను. పరమహంసవేషమును ధరించెను.

5. ఆయన భిక్షాటనమును స్వీకరించెను. సంగ్రహించుటకు వీలుపడని ముష్టిమాత్రము అన్నము స్వీకరించుపద్ధతిని అవలంబించెను. ఆయనకు భోగములయందు కోరికలు లేవు. అటులనే ఇతరుల ఉపదేశమును స్వీకరింపకుండునట్లు చేయు మత్సరముకూడ లేదు. ఇది రాణి చూచెను

6. రాజు రాజ్యమును త్యజించి స్వబుద్ధిచే భిక్షాటనమును తగిన దానినిగా గ్రహించినందున రాణి దుఃఖించెను. ఆమె పలికెను.

7. మీ మట్టికుండను బ్రద్దలుకొట్టి, దండమును, వస్త్రము లను లాగికొను నరునియందు మీ మనస్సు ఎట్లు ఉండును?"

తాత్పర్యమేమన, ఆసమయమున జనకునకు కోపము వచ్చి నను ఆయన సన్యాసము వ్యర్థమని తేలును.

ఈ రెండు ప్రమాణములను బట్టియు యాజ్ఞవల్క్యుడును, జనకుడును ఇరువురును శాస్త్రజ్ఞులగు విద్వాంసులు. కాని జ్ఞానము కలుగుటకు వారు గృహస్థాశ్రమమును, భార్యాబిడ్డలను, ధనాదులను త్యజించి సన్యాసమును తీసికొనిరి అని రుజువు అగుచున్నది. కామినీ కాంచనములను త్యజించక, గృహస్థాశ్రమమునందే ఉండి అన్నివిధ ములగు వ్యవహారములను జరుపుచు ఉండగా జ్ఞానము కలుగుట అసం భవము. గృహస్థాశ్రమమునందే జ్ఞానము కలుగుట సత్యమయినచో నాలుగు ఆశ్రమములను ఏర్పరచవలసిన అవసరము లేదు. బ్రహ్మచర్య గృహస్థాశ్రమములు రెండే ఉండి ఉండెడివి.

బృహదారణ్యకోపనిషత్తు చూడుడు :—

*"యది వేతరథా బ్రహ్మచర్యాదేవ ప్రవ్రజేత్ గృహాద్వా వనాద్వా"*

"ఆశ్రమక్రమమును పాటించుటకు ఇష్టము లేకపోయినచో బ్రహ్మచర్యమునుండియే సన్యసించవలెను.

వివేకము, వైరాగ్యము, షట్సంపదలు, ముముక్షుత్వము మొదలగు నాలుగు సాధనములు లేనిదే శ్రవణ, మనన, నిదధ్యాసన ములు జరుగవు. కావున గృహస్థాశ్రమానంతరము వానప్రస్థము నందు వైరాగ్యము, ఉపరతి మొదలగునవి ధరించి సన్యాసాశ్రమ మున సాధనములను బలపరచుకొని జ్ఞానమును పొందవలెను.

వైరాగ్యమునకు శ్రీశంకరులు తత్త్వబోధయందు చెప్పిరి.

"ఇహ స్వర్గే భోగేషు ఇచ్ఛారాహిత్యం విరాగః।"

"ఈలోకమునందును, స్వర్గమునందును లభించు భోగముల యందు కోరికలు లేకపోవుట వైరాగ్యము."

అటులనే ఉపరతిని గురించి వివేకచూడామణియందు చెప్పిరి :-

బాహ్యానాలమ్బనం వృత్తేరేషోపరతిరుత్తమా॥

"చిత్తవృత్తిని బాహ్యములగు అనాత్మపదార్థములయందు లగ్నముచేయకుండుట ఉపరతి." మాయికములగు స్త్రీధనాదులు, జాతికులాభిమానములచే చేయు యజ్ఞాదికర్మలు, శబ్దాదివిషయములు ఈపదార్థముల నన్నిటిని విషముతో సమానమని తెలిసికొని వానిని త్యజించవలెను. కామినీ కాంచనములను చూచినంతనే గ్లాని కలుగు నప్పుడే శ్రేష్ఠమగు ఉపరతి కలిగినదని గ్రహించవలెను.

పూర్వకాలమున కొందరు ఋషులు గృహస్థాశ్రమమును స్వీకరించినతరువాత ఒకరు ఇద్దరు పుట్టినవెంటనే ధనాదులను త్యజించి, ఉపరతిని పొంది, అరణ్యములు గుహలు మొదలగు ఏకాంతప్రదేశముల యందు నివసించి యోగాభ్యాసముద్వారా జ్ఞానము పొందిరి. జ్ఞానమును సంపాదించుటకు సన్యాసదీక్ష తీసికొనకపోయినను, కాషాయ వస్త్రములను ధరించకుండినను, దండాదిచిహ్నములను స్వీకరించ కున్నను లోపము లేదు. కాని, జ్ఞానసాధనములగు వైరాగ్యము, ఉపరతి మొదలగునవి పొంది యోగాభ్యాసమునకు ఏకాంతమును సేవించుట తప్పదు.

పంచదశి :- తత్త్వబోధః ప్రధానం స్యాత్ సాక్షాన్మోక్షప్రదత్వతః।
బోధోపకారిణావేతౌ వైరాగ్యోపరమావుభౌ॥

"తత్త్వజ్ఞానము సాక్షాత్తు మోక్షమును లభింపజేయును. అందుచే అది ముఖ్యము. వైరాగ్యము, ఉపరతి ఈరెండును ఆతత్త్వజ్ఞానమునకు సహాయము చేయును."

మూడవసన్యాసి:-అభ్యాసకాలమున వైరాగ్యము, ఉపరతి మొదలగునవి పాలించవలసివచ్చును. కాని జ్ఞానము కలిగినతరువాత

రాజ్యపాలన, సాంసారికాదిప్రవృత్తులు కలిగియున్నచో అందు తప్పేమి? యోగవాశిష్ఠమున "శిఖిధ్వజు"డను రాజును, ఆయనరాణి "చూడాల"యు ఇందుకు దృష్టాంతము. శిఖిధ్వజుడును చూడాలయు బ్రహ్మజ్ఞానము కలిగినతరువాత రాజ్యాదులను నిర్వహించిరి. అవి అందు వ్రాయబడియున్నది.

రెండవసన్యాసి:— యోగవాసిష్ఠము వాల్మీకికృతము కాదు. అది ఆధునిక గ్రంథము. అందలి ఇతిహాసభాగము కొంత వరకు సత్యము. కొన్ని దృష్టాంతములు పుక్కిటిపురాణములు. కావున ప్రమాణ దూరములైనవి. కావున అది ఈవిషయమున ప్రమాణముగా తీసికొన రాదు. వాస్తవముగా అసందిగ్ధమైన, నిశ్చితసంస్కారములుకల జ్ఞాని ఎప్పుడును వ్యావహారికజీవితమున కర్మములను ఆచరించలేడు. అష్టావక్రమహర్షి వాక్యము వినుడు:—

*వాగ్మిప్రాజ్ఞమహోద్యోగం జనం మూకజడాలసమ్।*
*కరోతి తత్త్వబోధోయమతస్త్యక్తో బుభుక్షిభిః॥*

"ఈతత్త్వబోధ-అనగా తత్త్వసాక్షాత్కారము వాగ్మిని (వక్తను) మూగివానిగాను, ప్రాజ్ఞుని జడునిగాను, ఉద్యమవంతుని సోమరిగాను చేయును. కావున భోగేచ్ఛకలవారు దీనినిత్యజించెదరు."

---

ఈవిషయమున బృహదారణ్యకమునందు జనకునకు యాజ్ఞవల్క్యుడు చెప్పిన పలుకులు వినదగినవి.

*తద్యథాఽహినిర్ల్వయనీ వల్మీకే మృతా ప్రత్యస్తా శయీతైవమేవేదం*
*శరీరం శేతేఽథాయమశరీరోఽమృతః ప్రాణో బ్రహ్మైవ తేజ ఏవ॥*

"సర్పశరీరమునుండి విడువబడిన కుబుసము అహంకార, మమకారరహితముగా నుండును. అటులనే జ్ఞానముచే త్యజించబడిన యీ దేహము మృతసమానముగా నుండును. ఇట్లు ఈశరీరమునందు జ్ఞాని

అహంకార, మమకార రహితుడయి యుండుటచే శరీరరహితుడును, మరణరహితుడును అగును. ఆ ఆత్మ బ్రహ్మమే, తేజమే యగును."

జ్ఞాని వ్యావహారిక జీవితమునకు నిరుపయోగి అని శాస్త్రములు వక్కాణించుచున్నవి. అంతియే కాదు. అహంకార, మమకార రహితుడై మృతసముడగునని కూడ చెప్పుచున్నవి. పారమార్థికములును, ఉపదేశాదికములును అగు సాత్త్వికవృత్తులు పరేచ్ఛచే చేయును. పఠన, పాఠన, యజ్ఞయాగాది సాత్త్వికక్రియలు పరేచ్ఛచేకూడ చేయడు. ఇక రాజ్యసంరక్షణాదికర్మములు రాజసములైనవి ఎట్లు చేయును?

రాత్రి చాల ఆలస్యమైనందున ఎల్లరును విశ్రమించిరి.